క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు అందజేసిన విద్యాసాగర్

షాద్‌నగర్: మండలంలోని కొండన్నగూడ, బుచ్చిగూడ, గొల్లకుంట తండాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు దాత బొంతపల్లి విద్యాసాగర్ నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా నిలవాలనే లక్ష్యంతో నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో తన వంతు సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం నందిగామ సురేష్‌కుమార్, హెచ్ఎంలు వెంకటరమణ, స్వరూప, సతీష్, ఉపాధ్యాయులు దుర్గారావు, శ్రీరాములు, కొండన్నగూడ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ ఖాజాభాను, కార్యదర్శి ప్రవలిక, సర్పంచ్ నర్సింలు, భద్రప్ప పాల్గొన్నారు.

లోకోస్‌యాప్‌పై అవగాహన

కేశంపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న వీఓఏలకు లోకోస్‌యాప్‌పై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వర్ణలత పాల్గొని యాప్‌పై అవగాహన కల్పించారు. ఇప్పటి నుంచి గ్రామాల్లో చిన్న సంఘాల ఆర్థిక లావాదేవీలు మెంబర్ ప్రొఫైల్ లేదా ఎస్‌హెచ్‌జీ అకౌంటింగ్ యాప్ లేదా లోకోస్‌యాప్‌లో మాత్రమే ఉంటుందని ఆమె తెలిపారు. ఇందులో ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భగవంతు, సీబీఓ ఆడిటర్ యాదగిరి, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రజిత, సీసీలు రాంచంద్రయ్య, మల్లేశ్, యాదయ్య, జంగయ్య, తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి, సుగుణమ్మ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

సర్పంచ్ పెంటయ్య

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తాళ్లపల్లి సర్పంచ్ సమ్మి పెంటయ్య అన్నారు. శనివారం తాళ్లపల్లిలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఉచిత వైద్య శిబిరాలు పేదలకు దేవుడిచ్చిన వరం లాంటివని తెలిపారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దు

మొయినాబాద్: తాతలకాలం నుంచి నలుగురు రైతులకు చెందిన భూమిని ఒకే రైతు తనపేరుపై మార్చుకొని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని రైతులు మండల తహసీల్దార్ అశోక్ కుమార్‌కు విన్నవించారు. మండలంలోని సురంగల్ రెవెన్యూలో సర్వే నంబర్ 169లో 16.26 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి పూర్వ నుంచి మండలంలోని ముర్తూజగూడకు చెందిన సామగాలిరెడ్డి, సామ ఎల్లారెడ్డి, సామ అంజిరెడ్డి, సామ చంద్రారెడ్డి పేర్లపై రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. నలుగురు రైతుల పేర్లపై ఉన్న భూమిని సామ గాలిరెడ్డి మనువడు మాధవరెడ్డి పలుకుబడిని ఉపయోగించి తన ఒక్కడి పేరును ధరణిలో నమోదు చేయించుకున్నాడు. ఆ భూమిని మాధవరెడ్డి విక్రయించే ప్రయత్నం చేస్తుండగా విషయం తెలుసుకున్న మిగతా ముగ్గురు రైతుల వారసులు, కుటుంబసభ్యులు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దని తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో సామ చంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం గడువు పెంచాలి

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్

శంకర్‌పల్లి: ప్రభుత్వం బీసీ కులవృత్తులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం సరికాదని శంకర్‌పల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగళి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉన్నా...తహసీల్దార్ కార్యాలయం నుంచి కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. ఏ మీసేవా కేంద్రానికి వెళ్లినా సర్వర్ రావడం లేదని చెబుతున్నారని వాపోయారు. మీ సేవాలో దరఖాస్తు చేసుకున్న తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే...ఏదైనా పాత కుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. దీంతో పనులు వదులుకొని కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. దరఖాస్తు గడువు కనీసం రెండు నెలలకు పెంచడంతో పాటు కుల, ఆదాయ ధ్రువపత్రాలు సులువుగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


కొత్తూరు: ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు


కేశంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌యాదవ్


శంకర్‌పల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొత్తూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా నిధులు మంజూరు చేస్తూ పట్టణాలకు దీటుగా అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వైఎంతండా,మల్లాపూర్‌తండా,మక్తగూడ గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలన సౌలభ్యంలో భాగంగా పలు తండాలు, అనుబంధ గ్రామాలను పంచాయతీలుగా మార్చినట్లు తెలిపారు. రికార్డులు భద్రత, సిబ్బంది విధులు నిర్వహించడానికి వీలుగా అన్నిచోట్ల పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తండాలు, అనుబంధ గ్రామాల్లో సైతం అంతర్గత రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మిషన్‌భగీరథ ద్వారా నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ శోభా, జెడ్పీటీసీ శ్రీలత, సర్పంచులు అరుణ, రాజు, రవి, నాయకులు సత్యనారాయణ, సిరాజ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట

షాద్‌నగర్‌రూరల్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని దేవునిబండతండా, మేళ్లగూడతండాల్లో గిరిజనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలతో నేడు గిరిజనులు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో 3146 గిరిజన తండాలను, గూడాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గిరిజన,ఆదివాసీలకు కుమురం భీం ఆదివాసీ భవన్, సేవాలాల్ బంజారా భవన్ నిర్మాణాలతో పాటుగా ఆదివాసీ పండుగలను, జాతరను అధికారికంగా నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మధులత, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీటీసీ అరుణ, పంచాయతీ కార్యదర్శి స్వప్నరెడ్డి, వీఓఏ శంకర్ పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో తండాలు అభివృద్ధి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో తండాలన్నీ అభివృద్ధి చెందాయని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మోకిల తండా, ఇరుకుంట తండాల్లో గిరిజన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని తండాలు ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయన్నారు. గిరిజనులే సర్పంచ్‌లుగా ఏలుతున్నరని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, సర్పంచ్ నీలమ్మ, ఎంపీటీసీ సరిత, సర్పంచ్ సంతోషి కుమారి, ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, మహారాజ్‌పేట్ సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కేశంపేట: తండాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గిరిజన దినోత్సవాన్ని మండలంలోని దేవునిగుడి తండా, పాల్కోనిగుట్ట తండా, తూర్పుగడ్డతండా గ్రామాల్లో శనివారం నిర్వహించారు. దేవునిగుడితండాలో నిర్వహించిన కార్యక్రమంలో రవీందర్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. 70 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన నాయకులు గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. తండాలు గ్రామ పంచాయతీలుగా లేకపోవడం వల్ల అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించి అధికంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శంకర్‌నాయక్,శశికళ, లలిత, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ నర్సింలు, ఎంపీటీసీ మంజుల, రాంచందర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి,మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తండాల అభివృద్ధి

నందిగామ: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు తండాలను చిన్నచూపు చూశాయని,కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తండాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని వివరించారు. ప్రత్యేక నిధులు ఇస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నాడని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, వైస్ ఎంపీపీ మంజుల,తహసీల్దార్ రహ్మాన్‌ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, నాయకులు రాందాస్ నాయక్, కిషన్‌నాయక్, తులసీరాం నాయక్, గణేశ్,గోవిందు,జమిని, శ్రీనివాస్, గోపాల్‌నాయక్, సోమ్లానాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో అధికారులకు చేదు అనుభవం

అభివృద్ధి ఎక్కడో చేశారో చూపాలని నిలదీత

శంకర్‌పల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఇరుకుంట తండాకు వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది.. ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఎంపీఓ గీతను ఇరుకుంట అభివృద్ధి ఎక్కడ చేశారో చెప్పాలని యువకులు నిలదీశారు. తమ తండాను నూతన పంచాయతీగా ఏర్పాటు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తండాకు సక్రమంగా రోడ్డు లేదని, కనీసం గ్రామానికి మిషన్ భగీరథ నీటికి గతిలేదని, ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా.. చేద్దాం..చూద్దాం..అంటూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. తమ గ్రామంలో రేషన్ షాపు కూడా లేదని వాపోయారు. తండా అభివృద్ధి చెందిందంటూ ఏ ముఖం పెట్టుకొని వచ్చారని యువకులు ప్రశ్నించారు. తండాలో ఒక్కసారి తిరిగి చూశాక ఉత్సవాలు జరపాలని చెప్పారు. మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో గిరిజన దినోత్సవాన్ని నామమాత్రంగా జరిపారు.

భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం

వ్యవసాయ శాస్త్రవేత్త రమేశ్

కొత్తూరు: పంటల సాగుకు ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రమేశ్ సూచించారు. కళాశాల నిర్వాహకులు దత్తత తీసుకున్న మండలంలోని మల్లాపూర్‌లో శనివారం ఆయన రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో మట్టిలో ఉన్న పోషకాలు, ఇతర వివరాలు తెలుసుకుని అందుకు తగ్గట్లుగా ఎరువులు, మందులు వాడితే పొలం సారవంతంగా మారుతుందన్నారు. అంతేకాకుండా విత్తనాల ఎంపికలో రైతులు చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి అవసరం ఉన్న మేరకే రసాయన ఎరువులు వినియోగించాలని కోరారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల రైతులు అనారోగ్యాలకు గురికావడంతో పాటు పొలాలు కలుషితం అవుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సాయిలు, నాయకులు రంగారెడ్డి, కిషోర్‌గౌడ్, తిరుపస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భుజంగం, రైతులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

బీజేపీ నాయకుడు నర్సింహయాదవ్

కేశంపేట: బీఆర్ఎస్ నాయకులు బీజేపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ... ఎంపీపీ రవీందర్ యాదవ్ కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం తొలగిస్తుందని అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ పరికరాలను ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతుబంధు పథకంతో సరిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, చందు, సాయి, మహేష్ యాదవ్, మచ్చేందర్ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్

చేవెళ్ల: నియోజకవర్గం అభివృద్ధి ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు పి. ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, మల్గారి రమణారెడ్డిలు ఆరోపించారు. శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ ప్రకటనపై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీగా మారితేనే ఒక పెద్ద పట్టణంగా మారి ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంకా ఎన్నాళ్లు ఇలా వెనకబడి ఉండాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటారన్నారని ప్రశ్నించారు. జనాభాపరంగా రెవెన్యూ, ఆదాయ పరంగా, విస్తీర్ణంలో కూడా విశాలమైన చేవెళ్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీగా చేస్తేనే పెద్ద పట్టణంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలు మున్సిపాలిటీ ప్రకటనను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని కొడిగుడ్డు మీద ఈకలు పీకడం కాంగ్రెస్ నాయకులకే సాధ్యమవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు విజయం సాధించడం ఖాయమని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచులు మోహన్‌రెడ్డి, జహంగీర్, మానిక్యరెడ్డి, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తెలుగు వెంకటేశ్, కృష్ణ, మహేశ్, ఫయాజ్ నాయకులు యాదగిరి, వెంకటేశ్, రవిందర్, సాయి, జనార్దన్, సచిన్, తదితరులు ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా మారిన ట్యాంకు

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో ఉన్న ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఆవరణలోని తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దర్గా దర్శనం కోసం వచ్చే భక్తులు దర్శనం అనంతరం ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. కాగా, ప్రస్తుతం ట్యాంకు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసినా ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో పలుమార్లు స్థానికులు ట్యాంకును కూల్చివేయాలని అధికారులకు విన్నవించిన ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ట్యాంకును కూల్చివేయాలని పలువురు కోరుతున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కాంగ్రెస్ నేత శేఖర్‌రెడ్డి

కొత్తూరు: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో శనివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి సొంతంగా ఆయన టోర్నమెంట్‌లో గెలిచిన ప్రథమ జట్టుకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ..10వేల నగదు బహుమతి అందజేశారు. అనంతరం శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో విద్యార్థులు, యువత పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో ఉద్యోగాలు సులువుగా సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే, ఆయా ప్రాంతాలకు చెందిన వ్యక్తుల మధ్యన క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. రాగి తీగల చోరీ


ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

కొత్తూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగలను చోరీ చేసిన ఘటన మండలంలోని మల్లాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ శివారులో మంగలి శ్రీశైలం వ్యవసాయ పొలం సమీపంలో ఏర్పాటు చేసిన రెండు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి(కాపర్) తీగలను చోరీ చేసినట్లు వివరించారు. విధుల్లో భాగంగా సిబ్బంది ఘటన స్థలికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై కనిపించాయి. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈ సాయికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘మీసేవ’ కష్టాలు

- 70వేల జనాభాకు ఒకే మీసేవ కేంద్రం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మొయినాబాద్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదు వేల జనాభాకు ఒక మీసేవ కేంద్రం ఏర్పాటు చేయాలి. కానీ ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతుంది. మొయినాబాద్ మండల జనాభా సుమారు 70 వేలు. అంటే సుమారు 14 మీసేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కానీ, ప్రస్తుతం మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండడంతో విద్యార్థులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలం మొత్తానికి ఒకే మీసేవ కేంద్రం కొనసాగుతుండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మొయినాబాద్‌లో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. మూడేళ్ల క్రితం హిమాయత్‌నగర్ మీసేవా కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో మూతపడింది. అలాగే రెండున్నర ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది.

నోటిఫికేషన్ ఇచ్చినా...

మూడేళ్ల క్రితం నిర్వాహకుడి మరణంతో మూతపడ్డ హిమాయత్‌నగర్ మీసేవా కేంద్రానికి గతేడాది ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చింది. మీసేవ నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరడంతో మండలంలోని చాలా మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష సైతం రాశారు. అయితే, మీసేవ కేంద్రాన్ని స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించారని మీసేవ కోసం దరఖాస్తు చేసుకుని పరీక్షరాసిన కొంత మంది తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాలి కానీ, ఇప్పటి వరకు ఇవ్వడంలేదు. మీసేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సీజ్ చేయడంతో నిర్వాహకుడు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చాడు. దీంతో మొయినాబాద్‌లో మీసేవ కేంద్రం నిర్వహించేందుకు స్టే అడ్డంకిగా మారింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మండలంలో ఒకే మీసేవా కేంద్రం ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్లకోసం మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి తోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ కేంద్రం వద్దకే వెళ్లాల్సి వస్తుంది. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లి మీసేవా కేంద్రం

కొత్తగా మీసేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మండలంలో ఒకే మీసేవా కేంద్రం ఉండడం వల్ల రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి మీసేవ కేంద్రం చాలా గ్రామాల ప్రజలకు దూరంగా ఉంది. మండలంలో మరికొన్ని మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తీర్చడానికి అధికారులు కృషి చేయాలి.

–జొన్నాద రాజు, చిలుకూరు, మొయినాబాద్ మండలం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



ప్రస్తుతం ఒకే మీసేవా కేంద్రం ఉంది. మొయినాబాద్ మీసేవ కేంద్రంపై కోర్టు స్టే ఉంది. హిమాయత్‌నగర్ మీసేవ కేంద్రానికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ రానుంది. మండలంలో మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

–అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి


యోగా సాధన చేస్తున్న నాయకులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు

షాద్‌నగర్: యోగా నిత్యం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సప్తహ యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవర్దన్ రెడ్డి మాట్లాడుతూ..యాంత్రిక యుగంలో ఆహార లోపం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మందులతో పరిష్కారం దొరకక చాలా మంది యోగా చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. యోగా మానసిక ఆరోగ్యానికి మంచి ఔషధంగా పని చేస్తుందన్నారు. యోగా ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తించడంతో ఐక్యరాజ్య సమితి 2015 జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, మురళీ, యోగా గురువులు శశిధర్, గవ్వయ్య, రామయ్య, రాంచంద్రయ్య, విజయ్‌కుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాజుగౌడ్, శివకుమార్, ఆనంద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ఎస్‌పీఎల్–2 క్రికెట్ పోటీలు షాబాద్‌లో హోరాహోరీగా సాగుతున్నాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్‌పీఎల్–2 క్రికెట్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఎంఎల్ టీంకు చెందిన సురేశ్‌కు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఇచ్చారు. అలాగే, గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. రానున్న కాలంలో క్రీడారంగం ప్రాముఖ్యంగా వెలుగొందుతుందన్నారు. ఆటల్లో గెలుపుకన్నా క్రీడాస్ఫూర్తి గొప్పది, దానికి లోబడే క్రీడాకారులు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ అశోక్, చెన్నయ్య, సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, నర్సింహులు, కొండల్‌యాదవ్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.